ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతిచర్చలు జరపాలి

● పౌర హక్కుల సంఘం రాష్ట్ర మూడవ మహాసభలో పలువురు వక్తల డిమాండ్

రాంనగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ ప్రభుత్వాలే పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్నాయని వక్తలు విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను అడవుల నుంచి తరిమేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఎదురుతిరిగితే తుపాకీలు ఎక్కుపెడుతున్నారని దుయ్యబట్టారు. ఆర్థిక అసమానతలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి పాత్రలేని వాళ్లు ఇప్పుడు వందేమాతరం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. సంఘ్ పరివార్ దేశానికి ప్రమాదకారిగా మారిందని ముంబాయి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కోల్సే పాటిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని ధ్వజమెత్తారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి నక్సలైట్లతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. 5వ షెడ్యూల్‌ను అమలు చేసి ఆదివాసీల హత్యాకాండను అరికట్టాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర 3వ రాష్ట్ర మహాసభలు రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం అధ్యక్షతన జరిగింది. ముఖ్యవక్తలుగా ముంబాయి హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ కోల్సే పాటిల్, ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్, ఆర్థిక విశ్లేషకుడు ప్రొఫెసర్ నర్సింహారెడ్డి, సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్, ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ మహారంజన్ మహంతి, సామాజిక కార్యకర్త బేల బాటియా, పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, న్యాయవాది రఘునాథ్ తదితరులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఎన్‌కౌంటర్లన్ని ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయకులైన ఆదివాసీలను ఎన్‌కౌంటర్ చేస్తున్నారని మండిపడ్డారు.. దేశంలో ఆర్థిక సమానతలు పెరిగిపోయాయని, తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటుందన్నారు. మెజారిటీ ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, దీన్ని కప్పిపుచ్చడానికి పాలకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే నిర్బంధాల పేరుతో బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం చేసే తప్పుడు ఎన్‌కౌంటర్లను ప్రశ్నిస్తే వారిని అర్బన్ నక్సలైట్లుగా ముద్రవేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. నక్సలైట్లను తీవ్రవాదులతో పోల్చడం సరి కాదన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇందిరాగాంధీ మొదలుకుని ప్రధాని మోదీ వరకు ప్రాథమిక హక్కులను అణచివేస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఆదివాసీల పౌర హక్కుల వ్యతిరేక చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దేశ వ్యాప్తంగా అన్నీ పౌర హక్కుల సంఘాలను సంఘటితం చేయడం ద్వారా హక్కుల ఉద్యమాన్ని బలోపేతం చేయాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో నారాయణరావు, నర్ర పురుషోత్తం, ప్రొ. సరోజ్‌గిరి, లింగన్న, విమలక్క, సోనిసోరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ జస్టిస్ కోల్సే పాటిల్, ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం


తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ముషీరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ డివిజన్‌లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని స్థానిక డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం ముషీరాబాద్ డివిజన్‌లోని సాయిరెడ్డి పటేల్‌నగర్ అజార్‌గల్లీలో నూతనంగా చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని నెలలుగా స్థానికంగా లోప్రెషర్ నీటి సరఫరాతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నాకు సమాచారం అందడంతో జలమండలి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, నాయకులు సత్యనారాయణ, విజయానంద్, బాలు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు జి వెంకటేష్, ఎంసీ మహేందర్‌బాబు

జూబ్లీహిల్స్‌లో బీజేపీని గెలిపించాలి

కవాడిగూడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీజేపీ అభ్య ర్థి లంకెల దీపక్‌రెడ్డిని గెలిపించాలని పార్టీ రాష్ట్ర నాయకుడు జి వెంకటేష్, నగ ర నాయకుడు ఎంసీ మహేందర్‌బాబు నియోజకవర్గ ఓటర్లను కోరారు. శని వా రం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగళరావు డివిజన్‌లో లంకెల దీపక్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ వెంగళరావునగర్‌లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండు ఒకటేనని ఈ రెండు పార్టీలు మైనార్టీల ఓట్ల కో సం పోటీపడుతున్నాయని అన్నారు. ఈ పార్టీల వల్ల నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని ఉపఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10న వరద బాధితులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ

కవాడిగూడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి విపత్తులు తలెత్తినపుడు నిరుపేదలను ఆదుకునేందుకు భారత్‌సేవాశ్రమం తనవంతు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని భారత్‌సేవాశ్రమ నగర అధ్యక్షుడు స్వామి మునీశ్వరానంద, నగర ప్రధాన కార్యదర్శి స్వామి వెంకటేశ్వరానంద తెలిపారు. ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా వరంగల్ జిల్లాలో నిరాశ్రయులైన నిరుపేదలకు సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 10న వరంగల్‌కు వెళ్లి నిరుపేదలకు చీరలు, ధోతిలు, దుప్పట్లు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్నట్లు వారు శనివారం ప్రకటించారు. సోమవారం ఉదయం బయలుదేరి వరంగల్‌లోని వరద ప్రాంతాలకు చేరుకొని అక్కడి జిల్లా కలెక్టర్ సహకారంతో వెయ్యిమంది నిరుపేదలకు వస్తువులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. శనివారం భారత్‌సేవాశ్రమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్రంలో ఎక్కడ విపత్తులు ఎదురైనా భారతసేవాశ్రమం పక్షాన బాధితులను ఆదుకుంటున్నామని తెలిపారు.

వైభవంగా కార్తీకమాసోత్సవాలు


లక్ష్మీగణపతి ఆలయంలోని క్షీరలింగేశ్వరస్వామి మందిరంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

చిక్కడపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి ఆలయంలోని పార్వతీక్షీర లింగేశ్వరస్వామి మందిరంలో కార్తీకమాసోత్సవాలను పురస్కరించుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. శనివారం ఏకవార రుద్రాభిషేకాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఆకాశదీప పూజ, కార్తీకపురాణ ప్రవచనాలు, భక్తులచే దీపారాధన, ప్రదోషపూజలను ఆలయ పండితులు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, ఈవో లక్ష్మారెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలోని శివాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, సాయంత్రం దీపారాధన కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి. రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో మహన్యాసం, ఏకవార రుద్రాభిషేకాలు జరిగాయి. ఆలయ చైర్మన్ జానకి సుధాకర్, ఈవో దేవనాథం భక్తులకు ఏర్పాట్లు చేశారు.


మహిళలతో కలిసి వనభోజనంలో కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

కార్తీక వనభోజనంలో కార్పొరేటర్

చిక్కడపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మహిళాసాధికారతను సాధించే దిశలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళలతో కలిసి గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనీవినయ్‌కుమార్ శనివారం కార్తీక వనభోజనంలో పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్, నీవీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పలు కమ్యూనిటీహాళ్లలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్, మగ్గం వర్క్, బ్యూటీషియన్ అంశాల్లో శిక్షణ పొందుతున్న మహిళలు కార్తీక వనభోజనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని నిర్వాహకులు, మహిళలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ ప్రతినిధులు రజిత, సారిక, మంజుల, విద్య, సంగీత, జ్యోతి, ప్రతిమ, టైలరింగ్ టీచర్లు లత, బ్యూటీషియన్ టీచర్ ప్రియాంక, మగ్గంవర్క్ టీచర్ రజిత పాల్గొన్నారు.


టీపీసీసీ మహిళా విభాగం నేత చంద్రకళశంకర్‌ను సన్మానిస్తున్న కేశవ్

సేవా కార్యక్రమాలు నిర్వహించేవారిని అభినందించాలి

చిక్కడపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలు నిర్వహించే వారిని అభినందించాలని టీపీసీసీ కార్యదర్శి జీఎన్ కేశవ్ అన్నారు. టీపీసీసీ మహిళా విభాగం రాష్ట్ర నేత చంద్రకళశంకర్ సేవా కార్యక్రమాలను అభినందిస్తూ శనివారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ ఎస్ఆర్‌టీ క్వార్టర్స్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ రాజకీయ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తూ చంద్రకళశంకర్ చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు జి. శంకర్, సీనియర్ నాయకులు నవీన్ కుమార్, నర్సింగ్‌రావు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన రహదారులతోపాటు కాలనీలు, అంతర్గత రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ముషీరాబాద్ మెయిన్ రోడ్ నుంచి బాకారంలోని బందన్ ఫంక్షన్ హాల్ వరకు కోటి రూపాయల వ్యయంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణం చేసినందుకు గానూ బాకారం బొమ్మలగుడి బస్తీవాసులు శనివారం బొమ్మలగుడి చౌరస్తాలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరం కాలంగా ఈ ప్రధాన రహదారి గుంతలమయంగా మారడం, సాగర్‌లాల్ ఆస్పత్రి వద్ద వర్షం, డ్రైనేజీ నీరు నిలిచిపోయి స్థానిక ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు నరకయాతన అనుభవించారని తెలిపారు. వారి విన్నపాల మేరకు తాము నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేసి కోటి రూపాయలను మంజూరు చేయించి వేశామన్నారు. నూతనంగా వేసిన రోడ్డుతో స్థానిక ప్రజలెదుర్కొంటున్న దీర్ఘకాలిక రోడ్డు సమస్య శాశ్వతంగా పరిష్కారమైందన్నారు. ముఠా జైసింహ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేస్తున్న ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు టి.శంకర్‌ముదిరాజ్ అధ్యక్షతన నాయకులు మన్నె గోవర్ధన్‌రెడ్డి, ముచ్చకూర్తి ప్రభాకర్, దీన్‌దయాల్‌రెడ్డి, గోక నవీన్, ముదిగొండ మురళీ, కల్యాణ్‌నాయక్, బస్తీనాయకులు శ్రావణ్, ప్రవీణ్, రేహన్‌ఖాన్, వెంకటేశ్వర్, రమేష్, జబ్బర్, ప్రేమ్, సైదులు, రాంరెడ్డి, ఎర్రం శేఖర్, మల్లేష్ యాదవ్, జ్ఞానేశ్వర్‌గౌడ్, మధు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బాకారం బొమ్మలగుడి బస్తీవాసులు

సులభంగా అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలి

● డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్

ముషీరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మరింత సులభంగా అర్థమయ్యేలా పాఠ్యబోధన చేయాలని ముషీరాబాద్ డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్ సూచించారు. ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాధానోపాధ్యాయులతో శనివారం ప్ర త్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడు తూ విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 5.0 కార్యక్రమంలో భాగం గా పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్క లు నాటి ఆహ్లాదకర వాతావరణాన్ని తీర్చిదిద్దాలి అన్నారు. ఐఎఫ్‌బి ప్యానల్ బోర్డుల ద్వారా విద్యార్థులకు విద్యాబోధన అందించడంతోపాటు ప్రతి పాఠశాలకు ఇంటర్‌నెట్ కనెక్షన్ తీసుకొని ఆధునిక పద్ధతులతో విద్యను అందించాలని సూచించారు. ఖాన్ అకాడమీ ద్వారా ఫిజిక్స్, గణితం, బయాలజీ పాఠ్యాంశాలను బోధిస్తూ పిల్లలకు వచ్చే అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. అలాగే సమాజంపై అవగాహన కల్పించేందుకు నిత్యం అవసరముండే బ్యాంకులు, పోస్టాఫీసులు, రైల్వే స్టేషన్లు తదితర ప్రధాన సేవలు అందించే సంస్థలకు తీసుకెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాబోయే 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా బోధనను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, భవాని, శోభారాణి, మీనాకుమారి, తారామణి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్


జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం ఖాయమని కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ జాతీయ కార్యదర్శి బిజ్జి శత్రురావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం షేక్‌పేటలో రాష్ట్రమంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే పద్మావతి కలిసి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. షేక్‌పేట్ డివిజన్ మత్స్య మహిళా సహకార సంఘాల సమావేశంలో పాల్గొని నవీన్‌యాదవ్‌కు మద్దతు ఇచ్చి గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగరాజు, సదానంద్, సుధారాణి, మంజుల, సబిత - ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి

జూబ్లీహిల్స్‌లో బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలి

● ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి

బర్కత్‌పుర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కార్మిక వ్యతిరేక బీజేపీ, బీఆర్ఎస్‌లను చిత్తుగా ఓడించాలని, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని మాజీ ఎంపీ, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం బర్కత్‌పురలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందని బీఆర్ఎస్ తెలంగాణను దోపిడీ చేసిన పార్టీ అని వీటిని ఓడించడమే కార్మికుల లక్ష్యం అని అన్నారు. సీసీ, భవన నిర్మాణ కార్మికులు జూబ్లీహిల్స్‌లో అధికంగా నివసిస్తున్నారని, వారంతా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని సూచించారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. నవీన్‌యాదవ్ సారథ్యంలో జూబ్లీహిల్స్ అభివృద్ధిలో ముందుకు సాగుతుందని అందుకే ప్రతి ఒక్కరూ ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నేతలు ఆర్.డి.చంద్రశేఖర్, జి.సత్యజిత్‌రెడ్డి, త్యాగరాజన్, సమ్మయ్య, సదానంద్, భూమయ్య, నగేష్, ఎల్.డి.పాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి

యజమాని మరణంతో అనాథలైన కుక్కలు షెల్టర్‌కు తరలింపు

రాంనగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కుక్కలను ఎంతో ప్రేమగా చూసుకునే యజమాని మృతిచెందడంతో అవి అనాథలుగా మారాయి. శనివారం ఆ కుక్కలను ఆశ్ర అనిమల్ ఎన్జీవో ప్రతినిధులు అక్కున చేర్చుకుని వాటిని షెల్టర్‌కు తరలించారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్యపార్కు సమీపంలో రేణుక ఎల్లమ్మ ఆలయం ముందు అపార్ట్‌మెంట్‌లో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి సంజీవ్ రెడ్డి ఉండేవారు. సంజీవ్‌రెడ్డికి వీధి కుక్కలంటే ఎంతో ప్రేమ, కుక్కలపై ప్రేమతో రోడ్డుపై గాయాలపాలైన, రోగాలకు గురైన వీధి కుక్కలను తన ఇంటికి తీసుకెళ్లి మంచి వైద్యం అందించే వారు. ఈ విధంగా చేరిన 40 కుక్కలకు అతను ఆహారం అందిస్తూ పెంచుకునేవాడు. వాటికి ప్రత్యేక బోన్లు ఏర్పాటుపాటు ఆహారంతో అన్ని సౌకర్యాలు కల్పించి కంటికిరెప్పలాగా చూసుకునే వాడని స్థానిక ప్రజలు తెలిపారు. సంజీవ్‌రెడ్డి ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో ఒక ప్లాట్ సహితం కుక్కలకు కేటాయించారని తెలిపారు. ఈ క్రమంలో గత నెల సంజీవ్ రెడ్డి మరణించడంతో కుక్కలను చూసుకునే వారు లేకుండా పోయారు. సంజీవ్‌రెడ్డి కుటుంబ సభ్యులు కుక్కలను పట్టించుకోలేదు. బోన్‌లో ఉన్న కుక్కలకు నెల రోజులుగా స్థానిక ప్రజలే ఆహారం అందించారు. సుమారు 40 వరకు ఉన్న కుక్కల్లో కొన్ని వెళ్లిపోయాయి. శనివారం ఆశ్ర అనిమల్ ఎన్జీవో ఆధ్వర్యంలో మిగత 12 కుక్కలను వారి షెల్టర్‌కు తరలించారు. ఈసందర్భంగా ఆ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గౌరీ వందన మాట్లాడుతూ మూగ జీవాలైన కుక్కలను రోడ్డుపై విడిచివేయడం అన్యాయం అన్నారు. అన్ని జీవులకు బతికే హక్కు ఉందన్నారు. సంజీవ్‌రెడ్డి ఎంతో ప్రేమగా పెంచుకున్న కుక్కలను వారి కుటుంబ సభ్యులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.


అనాథ కుక్కలను షెల్టర్‌కు తరలిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తి రిమాండ్

● చోరీచేసిన నగను భర్తతో కలిసి తనఖా పెట్టి నగదును తన అకౌంట్‌లో వేయించుకున్న భార్య సైతం అరెస్ట్

చిక్కడపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టాలు రావడంతోపాటు చిన్న కుమార్తె వివాహం కోసం చేసిన అప్పులు తీర్చడానికి దొంగతనం చేసి నష్టాలు పూడ్చుకోవాలని ఎత్తువేసి చైన్‌స్నాచింగ్ చేసి జీవితంలో మొదటిసారిగా చోరీకి పాల్పడి పోలీసులకు చిక్కిన ఓ వ్యక్తి కటకటాలపాలయ్యాడు. చోరీ చేసి తెచ్చిన బంగారు చైన్‌ను భర్తతోకలిసి మణప్పురం సంస్థలో తనఖా పెట్టి లక్షకుపైగా డబ్బులు తన అకౌంట్‌లో వేయించుకున్న భార్యను కూడా అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 4.6 గ్రాముల చైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. 14.4 గ్రాములు తనఖా పెట్టిన బంగారు నగకు సంబంధించిన రశీదును స్వాధీనం చేసుకున్నారు. శనివారం సాయంత్రం చిక్కడపల్లి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఐ శంకర్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్‌లతో కలిసి చిక్కడపల్లి సబ్‌డివిజన్ ఏసీపీ ఎల్. రమేష్‌కుమార్ వివరాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా వాస్తవ్యుడు గుడిపాటి బ్రహ్మయ్య(51), తన భార్య గుడిపాటి అంజలితో నగరంలోని బోరబండలో నివసిస్తున్నాడు. కాగా అతను చేస్తున్న వ్యాపారంలో నష్టం రావడంతోపాటు చిన్న కుమార్తె వివాహం కోసం అప్పులు చేశాడు. ఈ క్రమంలో చోరీ చేయాలని ఆలోచన చేశాడు. తొలుత బోరబండ, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో చోరీకి యత్నించాడు. సఫలం కాకపోవడంతో గత నెల 31న ఎర్రగడ్డ నుంచి నారాయణగూడకు మెట్రోరైలులో వచ్చాడు అక్కడి నుంచి కోఠికి చేరుకుని రాంకోఠి బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కిన ఎ.సురేఖ(69)ను బస్సులో వెంబడించాడు. చిక్కడపల్లిలో బస్సు దిగిన సురేఖ వెనుకనే నడిచాడు. ఆర్టీసీక్రాస్‌రోడ్ దేవిథియేటర్ వద్దనున్న తన అపార్ట్‌మెంట్‌కు చేరుకుని లిఫ్ట్‌కోసం వెయిట్ చేస్తున్న ఆమె మెడలోనుంచి రెండు తులాల గొలుసును బ్రహ్మయ్య బలవంతంగా లాగేసి పరారయ్యాడు. ఈ క్రమంలో సురేఖ మెడకు గా యం కూడా అయ్యింది. బ్రహ్మయ్య చోరీ చేసిన గొలుసును భార్యకు ఇచ్చి ఇద్దరూ కలిసి మణప్పురం సంస్థలో కుదువపెట్టి రూ.1.13లక్షలు తీసుకుని అప్పులు తీర్చేశారు. చోరీ జరిగిన రోజు బాధితురాలు సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న క్రైమ్ పోలీసులు శనివారం మధ్యాహ్నం బ్రహ్మయ్య, అంజలిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించడానికి సహకరించిన మెట్రోరైల్ సిబ్బందికి పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, డీఐ

ఆకట్టుకున్న బాలు పాటకు బ్రహ్మరథం

చిక్కడపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కళారవిందం ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయగానసభలో నిర్వహించిన బాలు పాటకు బ్రహ్మరథం పార్ట్4 కార్యక్రమం శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంది. గాయనీగాయకులు రామ్‌కుమార్, భార్గవినాగరాజులు ఈసందర్భంగా బాలసుబ్రహ్మణ్యం పాటలను మధురంగా ఆలపించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో పాల్గొన్న వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, సినీదర్శకులు అనిల్‌కుమార్, సంగీత దర్శకులు పార్థసారథి, సైంటిస్ట్ విశ్వనాథ్ మద్దిపట్ల, మధుసూదన్ పాల్గొని రామ్‌కుమార్, భార్గవినాగరాజును సన్మానించారు.



గానం చేస్తున్న రామ్‌కుమార్, భార్గవినాగరాజు



హాకీ పోటీల్లో విజేతలుగా నిలిచిన హైమావతి పాఠశాల విద్యార్థులు

హాకీ పోటీల్లో హైమావతి విద్యార్థుల ప్రతిభ

అంబర్‌పేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హాకీ పోటీల్లో అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌కు చెందిన హైమావతి పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. హాకీ ఇండియా ఏర్పడి నూరు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన నగరంలోని పాఠశాల విద్యార్థులు అండర్ 14, 17లోపు బాలబాలికలు పాల్గొన్నారు. 17 ఏళ్లలోపు బాలికల విభాగంలో హైమావతి పాఠశాల విద్యార్థులు బేగంపేట పాఠశాల విద్యార్థులను 2.1 గోల్స్‌తో ఓడించారు. అదేవిధంగా 14 ఏళ్ల బాలికల హాకీ పోటీలో, 17ఏళ్ల లోపు బాలుర హాకీ పోటీలో హైమావతి పాఠశాల విద్యార్థులు రెండవ స్థానంలో నిలిచారు. హాకీ పోటీల్లో విజేతలుగా నిలిచిన పాఠశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆవుల నిరంజన్ హాకీ కోచ్ కార్తీక్, పీఈటీ మంజునాథ్ అభినందించారు.

పవర్ బోరింగులకు మరమ్మతు పనులు

రాంనగర్ : రాంనగర్ డివిజన్‌లోని హరినగర్‌తో పాటు పలు బస్తీల్లో నిరుపయోగంగా మారిన పవర్ బోరింగ్‌లకు జలమండలి అధికారులు శనివారం మరమ్మతులు చేపట్టారు. బోరింగ్‌లకు మరమ్మతు చేపట్టాలని బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గడ్డం నవీన్ ఇటీవల జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన అధికారులు బోరింగ్‌లకు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులను శనివారం గడ్డం నవీన్‌తో పాటు హరినగర్ బస్తీవాసులు పరిశీలించారు.


కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు, కే.పీ.మురళీకృష్ణ, జి.లక్ష్మణ్ తదితరులు

ప్రజాపాలనలో అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధి


నల్లకుంట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో రాష్ట్రంలో అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధి జరుగుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కే.పీ.మురళీకృష్ణ పేర్కొన్నారు. శనివారం రేవంత్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని నల్లకుంట డివిజన్ రత్నానగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఆలోచన విధానంతో సీఎం నేతృత్వంలో ప్రజాపాలనతో రాష్ట్రాన్ని సుభిక్షంలోకి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పార్టీ నాయకులు నల్లకుంటలో ఏర్పాటు చేసిన కేక్‌ను మాజీ ఎంపీ వి.హనుమంతరావు కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట డివిజన్ పార్టీ అధ్యక్షుడు జి.లక్ష్మణ్, నాయకులు సీ.హెచ్.మురళీ, డి.లింగం, కట్టే శ్రీకాంత్‌యాదవ్, చికిలే మధుబాబు, లాలయ్యగౌడ్, వెంకటేష్, భీమ్‌రాజ్, రాఘవేందర్, దుర్గేష్‌గౌడ్, నేలంటి మధు, ఎంకె.శ్రీనివాస్, ఉపేంద్ర ప్రసాద్ దుబే, సైదులు, డి.ఎస్.రావు పాల్గొన్నారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో కారు దగ్ధం

● తప్పిన ప్రాణాపాయం

బ్రహ్మగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంఘాట్ రోడ్డులో ప్రమాదవశాత్తు కారు తగులబడిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. బ్రహ్మగిరి ఎస్ఐ జయన్న తెలిపిన వివరాల ప్రకా రం.. హైదరాబాద్ చిక్కడిపల్లికి చెందిన ప్రణవ్‌కుమార్ ఆరుగురు కుటుంబ సభ్యులతో కలిసి పార్చునర్ కారులో (నెం. ఏపీ 09 బీక్స్ 2828) శ్రీశైలం వెళ్తుండగా కృష్ణగిరి కృష్ణవేణి అతిథి గృహం సమీపంలో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కారులోంచి వారు క్షేమంగా బయటపడడంతో ప్రాణాపాయం తప్పిందని ఎస్ఐ పేర్కొన్నారు. దగ్ధమవుతున్న కారు మంటలు ఆర్పేందుకు జెన్‌కో ఫైర్ ఇంజన్ సహకారంతో తమ సిబ్బంది మంటలు ఆర్పినప్పటికీ అప్పటికే కారు పూర్తిగా కాలిపోయిందని, కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపడుతామని పోలీసులు చెప్పారు.


తగులబడుతున్న కారు


ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌కు శనివారం వచ్చిన ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కట్ట రాములు, తెలుగు యువత నాయకుడు నైషధం రాధాకృష్ణమూర్తి తదితరులు - రాంనగర్, ఆంధ్రజ్యోతి